మాంత్రికుడు

మూలం: **యూజేన్ సిరికోవ్**

అనుసరణ: **శారద**

పట్నమంతా అల్లకల్లోలంగా వుంది. సమ్మె వ్యాపిస్తోంది. మొదట కర్మాగారాల్లో బయల్దేరింది. తర్వాత పట్నమంతా వ్యాపించింది. సాయుధ పోలీసులు గస్తీ తిరుగుతున్నారు. ఒక్కొక్కప్పుడు సైనికులు చిటపటలాడే మొహాలతో, తళతళలాడే బాయ్‌నెట్‌లను గురిచేస్తూ, మిలిటరీ బ్యాండు వాయించుకుంటూ బయల్దేరుతారు. అప్పుడప్పుడు ఒక అశ్విక సైనికుడు, కన్నూ మిన్నూ కానకుండా, గుర్రాన్ని రోడ్లవెంబడి పరిగెత్తిస్తాడు. రోడ్డుమీది జనం నలువంకలా పరుగెత్తుతారు వాడి గుర్రం క్రింద పడి నలిగిపోతామని భీతావహంతో.

పట్నజీవితమంతా పైకి మామూలుగానే నడుస్తోంది. పెద్దవీధుల్లోని షాపుల అద్దాల కిటికీలు తళతళా మెరుస్తున్నై. బజారు రెండువైపులా, ప్రజలు గుంపులు గుంపులుగా పోతున్నారు. మామూలు ప్రకారంగా బాడుగబళ్లు వరసలుతీర్చివున్నాయి కాని వాటిల్లో ఒక రకమైన భీతి గాలిలో కలిసి, ఆవరించినట్టు తోస్తోంది. అతి సామాన్యమైన సంఘటనగూడా భయం కలిగిస్తోంది...

పోలీసువాడి విజిల్ శబ్దం ... టోపీ అన్నా లేని ఒక సామాన్యుడు రోడ్ల వెంబడి పరుగెత్తడం... చివరికి ... తాగుబోతుల గలాటా ... ఇవిగూడా భయం కలిగించినై... ఏమి జరుగుతుందో చూడాలని కొంతమంది తొందరగా వెళ్తారు ... మిగతావాళ్లు కొట్లవాకిళ్ళ వెనక దాక్కుంటారు... దేనికో ? ఎవరినించీ ఈ భయం ? ఎవరికీ తెలియదు !

కొన్ని సమయాల్లో, గుంపులు గుంపులుగా, కార్మికులు వీధివెంట వెళ్తారు. వాళ్లు తమ కెదురయ్యే మిత్రులతో ఏవో గుసగుసగా మాట్లాడతారు. చినిగినబట్టలు తొడుక్కునివున్న తమని లెక్కచెయ్యకండా తప్పుకుని వెళ్ళే పెద్దమనుష్యుల్ని ఈర్ష్యగా చూస్తో వుంటారు. అశ్విక సైనికులు వెంటబడి తరమగానే ఎటువాళ్లు అటే చెదిరి పారిపోతారు...

2

"అమ్మా! వాళ్ళేనా కార్మికులంటే?"

"అటు చూడకురా బాబూ, త్వరగా నడవరా!"

"వాళ్ళెందుకేమ్మా అట్లా పరిగెత్తుతున్నారు?"

"పోలీసుల్నుంచి తప్పించుకునేందుకు... రా, రా, మాట్లాడకండా"

పోలీసుల్నించా? ఏం! వాళ్ళు రోడ్డు మీద నడవకూడదా అమ్మా?

"అవును... వాళ్ళకి నడవటానికి అనుమతి లేదు"

"ఎందుకని?"

"పూరుగోరా! నన్ను వేధించకు. నా చెయ్యిపట్టుకునిరా తొందరగా లేకపోతే మనకూ కంచీదెబ్బలు తగులుతాయి".

'సర్జ' అనే ఆ కుర్రవాడు తల్లిచెయ్యి పట్టుకుని వేగంగా నడుస్తున్నాడు కార్మికుల గుంపులు చెదిరి నలువంకలా పరుగెత్తడం చూసి వాడు బెదిరిపోయినాడు; కాని ఏంజరుగుతోందో చూడాలని తగని ఆశగా వుంది.

"వాళ్ళు చెడ్డవాళ్ళా అమ్మా?"

"ఎవరురా?"

"ఈ కార్మికులు?"

"నాకు తెలీదు... మంచివాళ్ళూ వున్నారు, చెడ్డవాళ్ళూ వున్నారు... వాళ్లు పనిచెయ్యడంలేదు."

"సోమరివాళ్ళా అమ్మా?"

"పోరా! మాట్లాడక నా వెంటరా!"

"వాళ్ళు మురికివాళ్ళా అమ్మా?"

ఈ సమయంలో, కొందరు ఆశ్వికులు పరుగెత్తుకొస్తున్నారు. ఒకడు ఈల వేశాడు. ఒకడు కంచీవిసిరాడు. 'సర్జ' తల్లి కపించి పోయింది. అటుపోతున్న ఒక గుర్రపు బండెక్కి—"ఊఁ తోలు" అన్నది, భయం ధ్వనించే స్వరంతో.

"ఎక్కడికి పోవాలండి అమ్మా?" అని అడిగాడు బండివాడు.

"తోలు తొందరగా — నేరుగా పోనీ..."

"భయపడకండమ్మా - వాళ్లు మననేం చెయ్యరు."

అయినా, బండీ ఒక సందులోకి తిరిగినతర్వాతగాని ఆమెకి ప్రాణం తిరిగి రాలేదు ఆమె బండివాణ్ణిచూచి "నీకు ఇరవై కోపెక్సు ఇస్తాను. మర్చిపోకు సుమా" అని హెచ్చరించింది.

"గిట్టుబాటు కాదమ్మా" అన్నాడు బండివాడు.

"అట్లాగైతే బండి ఆపేసెయ్... ట్రాములోనైనా వెళ్తాం..."

"సరేనండి...... కాని ట్రాములు గూడా, కాసేపటికి ఆగిపోతాయిగా"

"ఎవరుచెప్పారు?"

"వాళ్లూ సమ్మెచేయబోతున్నారు"

బండి పరుగెడుతోంది. ఆమె బండీవాణ్ణి చూసి, "దేనికీ వీళ్ళతో యింత గొడవ? పనిచేయడానికి యిష్టంలేకపోతే, బయటికి వెళ్తారు......పొట్ట మాడితే వాళ్ళే పనిలోకి వస్తారుగా?" అన్నది.

బండివాడు ఆమెతో, "ఒక జంతువును మేతపెట్టకుండా మాడ్చి లొంగతీస్తాం. మనిషినీ ఆరకంగా లొంగతీయొచ్చు...— కాని బీదవాణ్ణి అట్లా మాడ్చడం పాపం కదండి?" అన్నాడు.

3

తల్లితోబాటు కుర్రవాడూ, ఇల్లు చేరుకున్నాడు. వాడు తన చెల్లెలిదగ్గర కెళ్ళి రహస్యంగా, "సోనియా! యివ్వాళ మేము కొంతమంది కార్మి

కుల్ని చూశాం......నిజంగా" అన్నాడు ఆశ్చర్యంగా.

"వాళ్ళెట్లా వున్నారు చూడ్డానికి?" అని అడిగింది ఆ అమ్మాయి.

"వాళ్ళా?—వాళ్ళు, మన రైతుల్ని ఎరగవూ? అట్లానేవున్నారు అచ్చంగా!"

కార్మాగారాల్ని ఆపేసి సమ్మె చేస్తూన్న కార్మికుల్ని గురించే రోజూ ఇంట్లో చర్చ జరుగుతోంది. కాని ఆశ్చర్యంవల్ల, కార్మికులు మంచివాళ్ళా, చెడ్డ వాళ్ళా అని నిర్ణయించేందుకు యెవరికీ శక్యం కాదు...

రెండు రోజులకల్లా ట్రాములు ఆగి పోయినాయి...వార్తాపత్రికలు ప్రచురణ కావడంలేదు. వీధులు చీకట్లో మునిగి పోయినాయి. రైల్వే స్టేషన్లలో గూడా భీతి ఆవరించింది. తర్వాత రెండు రోజులకు రైళ్ళూ ఆగిపోయినై......వార్తల రాకపోకలు అసలే స్తంభించేట్లు కన్పిస్తోంది.

'సెర్జ్' తండ్రి ఇంటికిముందే రావాల్సింది. కాని రాలేదు. 'సెర్జ్' తల్లికి దిగులెక్కువై అందరిమీదా మండిపడుతోంది. ఇంట్లోవాళ్ళందరూ కార్మికుల్ని తిట్టిపోయ సాగారు. కుర్రాడు, కిటికీదగ్గిర నిలబడి బజారులో జరిగేవాటిని శ్రద్ధగా పరికిస్తూ వచ్చాడు.

రోజు రోజుకీ పరిస్థితి విషమిస్తోంది. బజార్లు పుదయంనించే పాడుపడివున్నాయి. కొట్లన్నీ పాడుపడివున్నాయి ... కిటికీలు తలుపులు జాగ్రత్తగా మూసి వుంచుతున్నారు...రాత్రిళ్లు, సోల్జర్లు, ఆశ్వికసైనికులూ, వూరంతా గస్తీ తిరుగుతున్నారు. 'సెర్జ్' అర్ధరాత్రిళ్లు లేచి, కిటికీదగ్గర నిలబడి బజార్లో జరిగే విషయాలను జాగ్రత్తగా, వింతగా, చూస్తాడు...

కాగడాలు ప్రకాశించాయి. ఆ ఎర్రని కాంతులచుట్టూ పోలీసులు కొరివిదయ్యాలకిమల్లె, తారట్లాడుతున్నారు – రాత్రి వేళ, గుప్తమైన, భయంకరమైన సంఘటనలు జరుగుతున్నట్టు తోస్తున్నది ... కుర్రవాడికి వళ్ళు జలదరిస్తుంది...

"అమ్మా! అమ్మా! భయమేస్తోందే" అని కేకలువేస్తూ తల్లి దగ్గరికి పరిగెత్తుకొచ్చాడు, సెర్జ్. తల్లి మేలుకుని,"ఇంకా నిద్రపోలేదురా? బయిటు కెందుకెళ్ళావు?" అని అడిగింది.

"ఇంకా కాగడాలు మండుతున్నాయమ్మా! వాళ్లు మన ఇంటికెదురుగానే వున్నారింకా!"

"ఏమీ లేదులే, భయపడకు, నిద్రపో! అయ్యో...నాన్న ఇంకా రాలేదు గదా.."

"అమ్మా!"

"ఏం తండ్రీ?

"అమ్మా, నాకు భయమేస్తోందే ... నీదగ్గిరే పడుకుంటా"

"భయమెందుకు తండ్రీ?"

"ఆ మాంత్రీకుల్ని చూస్తే భయమేస్తోందే"

"ఏ మాంత్రీకులురా?"

"సమ్మె చేస్తున్నారే, ఆమాంత్రీకుల్ని"

"సరే, ఇట్టారా"

సెర్జ్ లేచి అమ్మ మంచందగ్గిర కెళ్లాడు ఒక్క గంతున. కొంతసేపు గడిచింది. కుర్రాడు, తల్లిచెయ్యి పట్టుకుని చిన్న గొంతుతో మెల్లగా, "వాళ్లు తల్చుకున్న దల్లా చేస్తారల్లేవుందమ్మా!" అన్నాడు.

ఆమె నిద్రపోయింది. కాని కుర్రాడు దుప్పటి తీసేసి గోడవంక చూశాడు. వీధిలో కాగడాల ప్రతిబింబాలు గోడ మీద కదులుతున్నాయి ... తను చదివిన, మాంత్రికులకథలు... జ్ఞాపకానికొచ్చాయి. మంచి మాంత్రికులూ... చెడ్డ మాంత్రికులూ వుంటారు ఆ కథల్లో... కార్మికులని పిలవబడే... మనుష్యుల్ని గురించి కుర్రవాడు తీవ్రంగా ఆలోచించాడు... వాళ్ళెవరూ? మంచివాళ్ళా, చెడ్డవాళ్ళా ?

4

ఒకరోజు భోజనం చేసేటప్పుడు మంచి రొట్టెలేదు. కుర్రవాడు వంట మనిషితో "ఇంకో రొట్టె ఇయ్యి" అన్నాడు.

మీ అదృష్టంవల్ల ఈ రొట్టెనా దొరికింది" అన్నది వంటమనిషి.

కుర్రాడు చివాలునలేచి, తల్లిదగ్గిరికి పోయి, "ఏం అమ్మా, ఇదియు చిరొట్టెకాదే" అన్నాడు.

"బాబూ మంచిరొట్టె ఎక్కణ్ణించి వస్తుంది? అన్నికొట్లూ మూసేశారుగా" అంది.

"ఎందుకనీ ?"

"కార్మికులు సమ్మెచేస్తున్నారు"

మళ్ళీ ఆ కార్మికులగొడవే! సెర్జ్ తల గోక్కుంటూ "ఈరొట్టెను ఎట్లాతినేట్టు?" అన్నాడు.

"అట్లాగే సరిపెట్టుకో వాలిబాబూ"

"మరే... అమ్మా! వాళ్ళని గవర్నరు గారైనా పనిలోకి పిలవగూడదు ? ఆయన వాళ్ళని పనిలోకి వెళ్ళేట్టు చేయగూడదు?"

"ఆయనవల్లగాదుబాబు, వాళ్ళు ఎవరికీ భయపడరు!"

కుర్రవాడు ఆశ్చర్యచకితుడైనాడు. 'గవర్నరుకిగాని - మరెవరికిగాని భయపడని - ఈ వింతవ్యక్తులు - ఎవరైవుంటారు' అని కుర్రవాడు ఆశ్చర్యపడ్డాడు కార్మికగారాల్ని, ట్రాముల్ని, పత్రికల్ని, - చివరకి రైళ్ళనిగూడా ఆపివెయ్యగలరు వాళ్ళు. కాని వాళ్ళని ఇంకెవ్వరూ ఏమీచెయ్యలేరు!... అరేబియన్ నైట్సులో, దేవతల కథల్లో చదివిన మాంత్రికులు కుర్రవాడికి జ్ఞాపకానికొచ్చారు.

5

వీధుల్లో జరుగుతూవున్న కల్లోలం ఎవరికీ అర్థంకానిరీతి మెల్లగా భాగ్యవంతుల మేడల్లోకి ప్రాకింది. అందువల్లవారు తమ అలవాట్లనీ దైనందిన జీవితాన్ని తప్పనిసరిగా మార్చుకోవలసి వచ్చింది. వారిఆనందమూ, కోలాహలమూ, విందులూ మాయమైనాయి. నవ్వులూ, విలాసాలు కనపడటం లేదు. నిత్యజీవితంలోని ప్రశాంతి నశించింది. వీటికి ప్రతిగా, దారుణమైనభీతి రోజు రోజుకీ పెరగసాగింది. పెద్దపెద్ద భవనాల తలుపులు రోజల్లా మూతబడేవున్నాయి. ఆ భవనాలముందు సాయుధులైన వ్యక్తులు కాపలాకాస్తున్నారు.

ఒక రోజు సెర్జ్ ఇంట్లో విద్యుద్దీపం వెలగలేదు. "దీపంలో ఏదో చెడిపోయిందమ్మా" అన్నాడు సెర్జ్.

"ఆ దీపం వెలగకపోతే, ఇంకోటి వెలిగించు" అన్నది తల్లి.

ఐదునిమిషాలు గడిచాయి.

"ఆ దీ పం గూ డా వెలగలేదమ్మా" అన్నాడు కుర్రాడు.

"ఓ! ఎలెక్ట్రిక్ కంపెనీలోగూడా సమ్మె

కాబోలు"అంది తల్లి దిగులుగా.

"ఇంట్లో అంధకారం ఆవరించింది. ప్రకాశమానమైన విద్యుద్దీపాలకి బదులు అక్కడక్కడ కొవ్వొత్తులు వెలుగుతున్నై. ఇంతలో పనిమనిషి పరిగెత్తుకొచ్చి.

"రేపు పైపులో నీళ్ళు రావుట, మాంసంగూడా దొరకదట! ఇంకా వారంరోజులు యిట్లాగే వుంటే, వూళ్ళో కరువు వచ్చేస్తుంది" అన్నది.

"సెర్జి" చాలా భయంతో ఆ వార్తల్ని విన్నాడు. వాడికి కార్మికుడు, చాలా పెద్ద ఆకారంగల వ్యక్తిగా గోచరమైనాడు. కార్మికుడు ఒక మాంత్రికుడు. అల్లావుద్దీన్ దగ్గిరవుండేదే మాయదీపం! అలాంటిదేదో ఈ కార్మికుడిదగ్గిర వుండి వుండాలి! అని ఆ కుర్రవాడి మనస్సుకు స్ఫురించింది!

ఆ మాంత్రికుడు అన్నీ చేయగలడు. అతడు తల్చుకుంటే, మళ్ళీ రైలు నడుస్తుంది. నాన్న వచ్చేస్తాడు; ఎలక్ట్రిక్ దీపం వెలుగుతుంది. కాని అతనికి ఇష్టం లేదా, పైపుల్లో నీళ్ళురావు. స్నానం చెయ్యటానికి వీల్లేదు. టీ-కాఫీ దొరకవు. అతనికి! ఆ మాంత్రికుడికి — యెవరన్నా భయంలేదు!

కుర్రాడనుకున్నట్టే, రెండు వారాల తర్వాత ఒక్కరోజున అనేక ఆశ్చర్య సంఘటనలు ఒక్కసారిగా జరిగాయి. ట్రాములు మళ్ళీ నడిచాయి; దీపాలు వెలిగాయి; పత్రికలొచ్చాయి. టపాలు మళ్లీ మామూలుగా నడిచాయి. నాన్నగూడా వచ్చేశాడు...టీ మంచి రొట్టె దొరికాయి. ఏకకాలంలో ఎన్నో మంచిపనులుజరిగినై. సెర్జి కుటుంబం అంతా బజారుకి వెళ్లారు. ఇప్పుడా మాంత్రికులు, గుంపులు గుంపులుగా జండాలుపట్టుకుని ఆనందంగా పాడుకుంటూ వెళ్ళడాన్ని కుర్రాడు చూచాడు. ఇప్పుడా మాంత్రికుల్ని ఎవరూ చెదరగొట్టలేరు. వాళ్ళూ ఎవరికీ భయపడి పారిపోరు.

అప్టన్ సింక్లేర్

ప్రస్తుతసమాజంలోవున్న అభిప్రాయాలు, కార్యవిధానాలు మనకు అతి సహజంగా కన్పిస్తాయి. సులభంగా అలవడుతాయి కూడా. ఒక శీతకాలంలోగాని కళారూపంలోగాని అలాంటి అభిప్రాయాలే ప్రకటితమైనప్పుడు అది "ప్రచారం"గా మనకు కన్పించదు.

కాని మన ఏకాగ్రదృష్టి, విజ్ఞానశక్తి పూర్తిగా వినియోగించి గ్రహించవలసిన కొత్త భావాలను మన మెదుర్కొన్నప్పుడు మనకు శ్రమా, అయిష్టము కలిగి కష్టంవేస్తుంది. అపుడు, ఇదంతా వట్టి "ప్రచారం"అని ఆ భావాలను మనం విమర్శిస్తాము.